సాక్షి తిరుపతి

మంగళవారం । 1 । జూలై । 2025



మా పిల్లలను బడికి రావద్దన్నారు

విలీనం పేరుతో గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ బడులను మూసివేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన బాట పట్టారు - 8లో



పోలీస్ గ్రీవెన్స్‌కు 88 అర్జీలు

తిరుపతిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి 88 అర్జీలు వచ్చాయి. - 8లో



కలెక్టర్‌కు వినతుల వెల్లువ

తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువలా వచ్చాయి. - 8లో

న్యూస్‌రీల్

ఇష్టారాజ్యంగా ఎంఎస్‌కే బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్: సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల (ఎంఎస్‌కే) బదిలీ కౌన్సెలింగ్‌లో అదే గందరగోళం నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు సోమవారం కూడా చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 600 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా.. సాయంత్రం 6 గంటలకు సగం మందికి మాత్రమే పూర్తయ్యింది. అయితే కౌన్సెలింగ్ సక్రమంగా నిర్వహించడంలేదని, సిఫార్సులు ఉన్న వాళ్లకు కోరుకున్న ప్రాంతంలో పోస్టింగులు ఇస్తున్నారంటూ పలువురు ఎంఎస్‌కేలు నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు, తిరుపతి ఏఎస్పీ వెంకటాద్రి, ఇతర అధికారులు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. దాదాపు మెజారిటీ ఉద్యోగులు తిరుపతి అర్బన్, చిత్తూరు అర్బన్ ప్రాంతాలనే కోరుకోవడం .. అక్కడ ఖాళీలు లేకపోవడం, కుప్పంలో 50కు పైగా పోస్టులు ఖాళీ ఏర్పడడంతో ఎవర్ని నియమించాలో తెలియక అధికారులు సైతం ఒకింత గందరగోళానికి గురయ్యారు.

జీవన నైపుణ్యం అవసరం



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులతో వర్సిటీ అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని తెలిపారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరి గెస్ట్ హౌస్‌లో పీఎం ఉష సహకారంతో 'జీవన నైపుణ్యాలపై' మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. రజిని మాట్లాడుతూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు జీవితంలో ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నైపుణ్యాలు అవసరమని చెప్పారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె శేఖర్, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సీ వాణి ప్రసంగించారు. అనంతరం అతిథులను సన్మానించారు. శిక్షకులు డాక్టర్ సంజీవ్ కుమార్, ప్రొఫెసర్ ఉష, డాక్టర్ జి శిరీష, డాక్టర్ వజిహాబానుతోపాటు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంటపాటు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి సిటీ: స్విమ్స్ కార్మికులు చేపట్టిన ఆందోళన రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నాలుగు రోజులుగా రిలేనిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులు మంగళవారం నుంచి ప్రతిరోజు గంటపాటు విధులను బహిష్కరించి నిరసన తెలపనున్నారు. ఈ మేరకు స్విమ్స్ ఉద్యోగ కార్మిక సంఘాల యూనియన్, సీఐటీయూ సంయుక్తంగా అధికారులను హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ స్విమ్స్ యాజమాన్యం చేసిన విజ్ఞప్తి మేరకు తమ యూనియన్ నేటి నుంచి తలపెట్టిన సమ్మె కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నామని చెప్పారు. అయితే మంగళవారం నుంచి సమస్యల పరిష్కారానికి కార్మికులు గంటపాటు విధులను బహిష్కరించి నిరసనలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, కే వేణుగోపాల్, జిల్లా నేతలు టి సుబ్రహ్మణ్యం, మాధవ్, వేణుగోపాల్, బుజ్జితోపాటు యూనియన్ నేతలు పాల్గొన్నారు.

తిరుపతి మేయర్‌కు దక్కని గౌరవం

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రథమ పౌరురాలైన మేయర్‌ను కూటమి ప్రభుత్వం తీవ్రంగా అవమానిస్తోంది. మేయర్ హోదాకు ఉన్న ప్రాముఖ్యతను విస్మరిస్తోంది. హర్యానా రాష్ట్రం గురుగ్రామ్ వేదికగా భారత పార్లమెంటు 'ది రోల్ ఆఫ్ అర్బన్ లోకల్ బాడీస్ ఇన్ స్ట్రెంథ్నింగ్ కాంస్టిట్యూషనల్ డెమోక్రసీ అండ్ నేషన్ బిల్డింగ్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తోంది. జూలై 3, 4 తేదీల్లో నిర్వహించే ఈ సదస్సుకు ఆయా రాష్ట్రాల నుంచి మేయర్లు, చైర్ పర్సన్‌లను పంపించాలని పార్లమెంట్ జనరల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అధికార పార్టీకి చెందిన వ్యక్తులు చిన్న పదవుల్లో ఉన్నా వారిని ఎంపిక చేసి, ప్రతిపక్షానికి చెందిన వారు ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ వారిని దూరం బెట్టింది. తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్ శిరీషను కాకుండా రెండవ డిప్యూటీ మేయర్‌ను మాత్రమే పంపించడం ఇప్పుడు వివాదానికి కారణమైంది. నగర ప్రథమ పౌరురాలికి కనీస మర్యాదను ఇవ్వకపోవడం గమనార్హం.



కూటమి సర్కారు దొంగాట ఆడుతూ మామిడి రైతులను నిండా ముంచేసింది. దొంగచాటుగా అధికార పార్టీ నేతల సిఫార్సులకు టోకెన్లు ఇచ్చి సామాన్య రైతులను పక్కన పెట్టేసింది. దీంతో ప్రభుత్వ పెద్దల తీరుపై మామిడి రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న మామిడి చెట్లను నిలువునా నరికేసుకుంటున్నారు. ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చేయకపోవడంతో మామిడి కాయలను రోడ్లపై పారబోస్తున్నారు. ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి క్యూలో వేచి ఉన్నా, కనికరించే నాథుడు కరువయ్యారు. కాయలు అమ్ముకోవడానికి రేయింబవళ్లు నిద్రాహారాలు లేకుండా నిరీక్షించిన రైతులు కడుపు మండి ధర్నాకు దిగుతున్నారు. ఈ పరిణామాల నుంచి రైతులు, ప్రజల దృష్టిని మరల్చడానికి కూటమి నేతలు, ఎల్లో మీడియాతో కలిసి వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు పక్కా స్కెచ్ వేశారు. రెండు రోజులుగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ప్రచారం ప్రారంభించారు.



గుడిపాల మండలం గొల్ల మడుగు వద్ద.. క్యూ కట్టిన మామిడి కాయల వాహనాలు

గ్రౌండ్ రిపోర్ట్

సర్కారు దొంగాట!

మామిడికి మద్దతు ధర ఇవ్వకుండా కుట్ర

- ఫ్యాక్టరీ యజమానులతో కూటమి నేతల కుమ్మక్కు
- కడుపు మండి.. రైతుల ఆందోళన
- రైతుల దృష్టిని మరల్చేందుకు పెద్దిరెడ్డిపై నిందలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గత కొద్ది రోజులుగా మామిడి రైతుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం మొదట్లో మామిడి కిలో రూ.12గా ప్రకటించింది. ఆ తరువాత రూ.8 అని చెప్పింది. ఇంకో రోజు రూ.6 అని, ఆ తరువాత రూ.5 అని ఇష్టానుసారంగా రోజుకొక ధర చెబుతూ రైతులను మభ్యపెడుతూ వస్తోంది. ధర లేకపోతే పోనీ ఏదో ఒక రేటుకు కాయలు విక్రయించేస్తామన్న రైతులకు టోకెన్లు ఇవ్వడం లేదు. దానికి టీడీపీ నేతల సిఫార్సులు కావాలి. దీంతో పండించిన పంటను సకాలంలో అమ్ముకోలేక మామిడిని రోడ్లపై పారబోస్తున్నారు. మరి కొందరు రైతులు మామిడి కాయల లోడ్లను తీసుకొచ్చి ఫ్యాక్టరీల ముందు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. చాలా వరకు కాయలన్నీ ట్రాక్టర్లలోనే కుళ్లిపోతున్నాయి.



చిత్తూరు నగరం గంగాసాగరంలో కాయలు దింపుకుంటున్న ఓ ర్యాంపు

తెల్ల కాగితాలపై సంతకాలు

రైతులు పరిస్థితిని అవకాశంగా తీసుకున్న ఫ్యాక్టరీ నిర్వాహకులు తెల్లకాగితాలపై సంతకాలు తీసుకుని కాయలు దించుకుని పంపేస్తున్నారు. ఈ పరిణామాలతో రైతులు ధర్నాలకు దిగుతున్నారు. గంగాధరనెల్లూరు వద్ద ఓ ఫ్యాక్టరీ యజమాని, అధికారులు, కూటమి నేతలు కుమ్మక్కై దొంగచాటుగా వారికి అనుకూలంగా ఉన్న వారి కాయలను మాత్రం దించుకోవడాన్ని మామిడి రైతులు గమనించారు. వారి తీరుని నిరసిస్తూ ఆదివారం రోడ్డుపై వాహనాలతో మెరుపు ధర్నా చేపట్టారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడ్డ కూటమి నేతలు వారి దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీపై బురద జల్లడం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నేతలే కొందరిని రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారంటూ ఎల్లో మీడియాతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

అడుగడుగునా దగా..

- ఒక ట్రాక్టర్ కాయలు ఫ్యాక్టరీల వద్ద అన్‌లోడ్ చేయడానికి 3 రోజుల నుంచి వారం రోజులు సమయం తీసుకుంటున్నారు. అదే కూటమి నేతలు, అధికారులకు తెలిసిన వారి ట్రాక్టర్లు దొంగ చాటుగా ఒక్క రోజులోనే అన్‌లోడింగ్ చేసి పంపేస్తున్నారు.
- ప్రస్తుతం ఒక్కో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద సుమారు 3 కిలోమీటర్ల దూరం మేర మామిడి కాయల ట్రాక్టర్లు క్యూ కట్టి ఉన్నాయి.
- దీని వల్ల ఒక ట్రాక్టర్‌లో 5 టన్నుల కాయలతో వస్తే అన్‌లోడ్ చేసే నాటికి దాదాపు 1.5 టన్ను కాయలు పాడైపోతున్నాయి.
- ఫ్యాక్టరీ యాజమాన్యాలు ట్రాక్టర్ల అన్‌లోడింగ్ కోసం రోజుకు 100 టోకెన్లు ఇస్తామని చెబుతున్నా కేవలం 50 టోకెన్లు మాత్రమే ఇస్తున్నారు.
- అన్‌లోడింగ్ చేసుకుని ఎన్ని టన్నులు దించుకున్నామంటూ రైతులకు బిల్లులు ఇస్తున్నారు. అయితే ఆ బిల్లులో కిలో మామిడి ధర ఎంతో స్పష్టం చేయలేదు.
- దీనిపై రైతుల నుంచి తిరుగుబాటు రాకుండా అంగీకార పత్రంపై రైతు వద్ద నుంచి సంతకం తీసుకుని పంపుతున్నారు.
- దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం తర్వాత ఎంత ధర చెల్లించినా రైతులు ప్రశ్నించే అవకాశం లేదు.
- ఒక ట్రాక్టర్‌కు లోడ్ చేసే మామిడి కాయలు కోయడానికి రైతుకు రూ.4 వేలు ఖర్చు అవుతోంది. బాడుగ (ఐదు రోజులకు) రూ.7 వేలు.
- ఒకవేళ ఐదు రోజుల్లోపు ఫ్యాక్టరీ యాజమాన్యం కాయాలను దించుకోకుంటే, ఐదో రోజు తర్వాత మళ్లీ అదనంగా రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు రైతు అదనంగా బాడుగ చెల్లించాలి.
- టీడీపీ కూటమి నాయకులు సిఫారసు చేసిన రైతుకు చెందిన మామిడి కాయల ట్రాక్టర్లను రాత్రి వేళ ఫ్యాక్టరీలోకి పంపి అన్‌లోడ్ చేసుకుంటున్నారు. సామాన్య రైతులు మాత్రం రోజుల తరబడి రోడ్లపైన వేచి ఉండలేక కొందరు రోడ్డుపైనే కింద పారబోసి వెళ్లిపోతున్నారు.
- ప్రభుత్వం మామిడి కాయలను రైతు నుంచి ఒక కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీలకు ఆదేశించింది. అయితే ఇప్పటివరకు 8 రూపాయల లెక్కన ఎక్కడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం
- ర్యాంపుల వద్ద కిలో మామిడి కేవలం రెండు రూపాయలుగా మాత్రమే నిర్ణయించారు. చేసేది లేక రైతులు రూ.2కే అమ్ముకోవాల్సిన దుస్థితి కలిగింది.



తోతాపురి మామిడి కాయలు

ఇంత దిగజారుడుతనమా?



రైతులను ఆదుకోవాల్సింది పోయి కూటమి ప్రభుత్వం, ఎల్లో మీడియా దిగుజారుడు రాజకీయాలకు దిగడం దారుణం. మామిడి దిగుబడులకు మద్దతు ధర కల్పించలేక, రోజుల తరబడి క్యూలో ఉన్న మామిడిని కొనుగోలు చేయలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఫ్యాక్టరీ యజమానులు, కూటమి నేతలు కుమ్మక్కై మామిడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత కొద్ది రోజులుగా కూటమి ప్రభుత్వ తీరుని గమనిస్తున్న మామిడి రైతులు తిరగబడుతున్నారు. దీని నుంచి రైతుల దృష్టిని మరల్చటానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇంతకన్న దిగజారుడుతనం మరొకటి లేదు, ఉండబోదు.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు

కార్మికుల సమస్యలపై కలిసి పోరాడదాం

- సీపీఎం నేతలకు ఎంపీ డాక్టర్ గురుమూర్తి హామీ

తిరుపతి కల్చరల్: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ నాయకులతో కలిసి పోరాడతామని సీపీఎం నేతలకు తిరుపతి ఎంపీ గురుమూర్తి హామీ ఇచ్చారు. గంధమనేని శివయ్య భవన్‌లో సోమవారం జరిగిన ఓ ప్రవేటు కార్యక్రమానికి హాజరైన ఎంపీ డాక్టర్ గురుమూర్తి సీపీఐ జిల్లా కార్యాలయానికి చేరుకుని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నాయకులతో కలిసి ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అంగన్‌వాడీ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, స్కీం వర్కర్లకు, వర్తించడం లేదని సీపీఎం నేతలు తెలిపారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులతో పాటు పలు అంశాలపై చర్చించారు. మరోసారి సమావేశమై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుందామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నేతలు రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రయ్య, అల్లాబాషా పాల్గొన్నారు.



సీపీఐ నేతలతో చర్చిస్తున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి

ముగిసిన డాక్టర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

తిరుపతి తుడా: ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో ఎస్వీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా సాగిన డాక్టర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం ముగిసింది. మొత్తం 650 మంది డాక్టర్లు రిజిస్ట్రేషన్, రీ-రిజిస్ట్రేషన్, ఎన్‌టీసీలు, నూతన రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వైద్యమండలి చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు తెలిపారు. త్వరలో రెండవ దఫా డిసెంబర్, జనవరిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ జి రవి ప్రభు, సామాజిక వైద్య విభాగ అధిపతి డాక్టర్ ఎస్ సునీత, ఐఎంఏ డాక్టర్లు డాక్టర్ వాసుదేవ నాయుడు, డాక్టర్ జనార్దన్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ హరికృష్ణ, విజయవాడ ఏపీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మోసం.. బాబు నైజం!



మోసాల మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

- అబద్ధాలు చెప్పి వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య
- ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చావా బాబూ?
- రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళదాం
- చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ''చంద్రబాబు అధికారం కోసం ఎంతకైనా దిగజారుతారు..ఎన్ని అబద్ధపు హామీలైనా గుప్పిస్తారు.. నమ్మిన వాళ్లను మోసం చేయడానికి వెనకాడరు.. మోసం, వంచన, ద్రోహం, వెన్నుపోటు అనే పాఠాలను చిన్నప్పటి నుంచి బాగా వంటపట్టించుకున్నారు. ఆయన షూరిటీ ఇచ్చాడంటే అంది గ్యారంటీగా మోసమే'' అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పద్మావతిపురంలోని జిల్లా పార్టీ కార్యాలయం వద్ద తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు చెప్పే హామీలు నెరవేర్చేటివి కాదు కాబట్టే నోటికి వచ్చిన అబద్ధాలు గుప్పిస్తారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ హామీ ఇద్దామని తామంతా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి చెబితే అది సాధ్యంకాదని, అలాంటి అబద్ధాలు చెప్పలేనంటూ ఖరాకండిగా చెప్పారని గుర్తు చేశారు. అయితే చంద్రబాబు మాత్రం రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక కేవలం రూ.7వేల కోట్లు కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల కంటే మించి రూ.3 లక్షల కోట్లు విలువ చేసే సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. గత ఎన్నికల్లో జగనన్న కంటే రెండింతలు సంక్షేమ పథకాలు అందిస్తానంటూ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతున్నా ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. అయినవాళ్లకే వెన్నుపోటు పొడిచి అధికారం దక్కించుకున్న దుర్మార్గుడు అన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు కూటమి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తిరుపతి నగర మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ


కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న రజకులు


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయుడుపేటకు చెందిన వ్యాన్ డ్రైవర్లు

- గ్రీవెన్స్‌కు 296 అర్జీలు
- రెవెన్యూ సమస్యలపై 145 అర్జీలు

తిరుపతి అర్బన్: గ్రీవెన్స్ సందర్భంగా సోమవారం పలుప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా అర్జీలు ఇవ్వడానికి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. మొత్తం 296 అర్జీలు రాగా, అందులో 145 అర్జీలు రెవెన్యూ సమస్యలపై ఉన్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, పలువురు జిల్లా అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెద్ద ఎత్తున అర్జీదారులు విచ్చేశారు. ఈ క్రమంలో రశీదుల కోసం అర్జీదారులకు పడిగాపులు తప్పలేదు. అయితే వీఆర్ఏలు, అటెండర్లు అర్జీలను రాసి అందించారు. గ్రీవెన్స్‌లో ఉన్న కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు పలువురు జిల్లా అధికారులను సోమవారం కుంభమేళాకు వెళ్లి విచ్చేసిన నాగసాధువులు ఆశీర్వదించారు.

రజకుల స్థలానికి రక్షణ కల్పించండి

తిరుపతి రూరల్ మండలం పేరూర్ పంచాయతీ యాదవ్‌కాలనీలో నివాసం ఉంటున్న రజకులకు 2014లో 30 సెంట్లు, ఆ తర్వాత అదే ఏడాది మరో 20 సెంట్లు భూమి కేటాయించారని రజకులు వెల్లడించారు. అయితే ఆ స్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ పంచాయతీ కార్యదర్శి తమదీ అంటూ కంచె ఏర్పాటు చేశారని చెప్పారు. దీన్ని పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. నాయుడుపేటలో మినా ట్రక్స్, వ్యాన్ డ్రైవర్లకు అంబేడ్కర్ భవనం సమీపంలోని ఆర్‌అండ్‌బీ స్థలంలో పార్కింగ్ చేసుకోవడానికి స్థలాన్ని గతంలో కేటాయించారని చెప్పారు. అయితే ఆస్థలాన్ని ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో తమకు న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు, వ్యాన్ డ్రైవర్లు ఓ.గిరి, మస్తాన్ రెడ్డి. సిహెచ్.హేమంత్, వి.రమణయ్య, అమీర్, చెంచు కృష్ణయ్య, జిలాని, సతీష్, మాధవ్, చంద్ర పాల్గొన్నారు.

తప్పుడు నివేదికలు ఇస్తున్నారు

గత ఏడాది డిసెంబర్ వరకు 15,264 అర్జీలు గ్రీవెన్స్‌లో వస్తే అందులో 15,103 అర్జీలు పరిష్కారం అయినట్లు కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మండిపడ్డారు. ఆయన కలెక్టరేట్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. గత ఏడాది జిల్లాలో గ్రీవెన్స్ ద్వారా వచ్చిన అర్జీల్లో 98.94శాతం పరిష్కారం చేసినట్లు లెక్కలు చూపడం దారుణంగా ఉందని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలం అమ్మ చెరువులో చెరువు ఆక్రమణలు తొలగించాలని గతంలో అర్జీ ఇచ్చినా ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా ఆన్‌లైన్‌లో సమస్య పరిష్కారమైనట్లు చూపడాన్ని తప్పుపట్టారు. ఇలాంటి సమస్యలు చాలా ఉన్నాయని, వాటన్నింటిపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. టూరిజంలో పని చేస్తున్న లోకల్ గైడ్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నేతలు జయచంద్ర, కరిముల్లా, బాలాజీ తదితరులు అధికారులకు ఓ వినతిపత్రాన్ని అందించారు.

క్లుప్తంగా

క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో వీసీలు


వర్క్‌షాపులో పాల్గొన్న ఎస్వీయూ, మహిళా వర్సిటీ వీసీలు

తిరుపతి సిటీ: విజయవాడ హోటల్ నోవోటెల్‌లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక అమరావతి క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీ అప్పారావు, మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పాల్గొన్నారు. అమరావతిని భారతదేశ క్వాంటమ్ వ్యాలీగా – తదుపరి తరం క్వాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా ఉంచాలన్న లక్ష్యంగా క్వాంటం కంప్యూటింగ్, కంప్యూటర్ సైన్స్, గణితం, భౌతిక శాస్త్రం వంటి కీలక డొమైన్‌లపై సోమవారం జరిగిన వర్క్‌షాప్‌లో వీసీలు పాల్గొన్నారు. వీసీలు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్‌తో సహా ఎంపిక చేసిన అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో క్వాంటం కంప్యూటింగ్‌ను మైనర్ సబ్జెక్టుగా ప్రవేశపెట్టే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఎస్వీయూ నుంచి ఆచార్య సుబ్బారావు, డాక్టర్ ఉషా రాణి, ఆచార్య జయ సుబ్బారెడ్డి, డాక్టర్ హేమలత, రుద్రమదేవి, ఆచార్య అంజన్ బాబు పాల్గొన్నారు.

మూడు టిప్పర్లు సీజ్


సత్యవేడు ఆర్టీసీ గ్యారేజ్‌కు తరలించిన కంకరు టిప్పర్లు

సత్యవేడు: మండల కేంద్రంలోని సమీపంలో మూడు టిప్పర్లను మైన్స్ అధికారులు సీజ్ చేశారు. అధికారులు సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా చమర్తికండ్రిగలోని సెవన్ హిల్స్ క్వారీ నుంచి తమిళనాడుకు కంకరు తరలిస్తున్న మూడు టిప్పర్లకు బిల్లులు సక్రమంగా లేకపోవడంతో తిరుపతి మైన్స్ అధికారులు వాటిని సీజ్ చేశారు. అక్కడి నుంచి సత్యవేడు ఆర్టీసీ గ్యారేజ్‌కు తరలించారు.

మా పిల్లలను బడికి రావద్దన్నారు


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రాజుగుంట ఎస్సీ కాలనీ వాసులు

తిరుపతి అర్బన్: మూడు దశాబ్దాల క్రితం 6 లేదా 7 పంచాయతీలకు ఒక ప్రభుత్వ పాఠశాల ఉండేది. ఆ తర్వాత మారుతున్న కాలానుగుణంగా విద్యను అందరికీ అందించాల్సిన ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ప్రతి గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేసేలా కృషి చేశారు. దీంతో విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గడంతోపాటు అక్షరాస్యత పెరుగుతూ వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం మళ్లీ క్లస్టర్ల (విలీనం) పేరుతో 6 లేదా 7 గ్రామాలకు ఒక పాఠశాలను ఏర్పాటు చేయడంపై రగిలిపోతున్నారు.

రాజుగుంట ఎస్సీకాలనీ వాసుల నిరసన

శ్రీకాళహస్తి మండలం యార్లపూడి పంచాయతీలో ఉన్న రాజుగుంట ఎస్సీకాలనీలో మూడు దశాబ్దాలుగా ప్రాథమిక పాఠశాల ఉంది. అయితే క్లస్టర్ పేరుతో మోడల్ స్కూల్ అంటూ మన్నవరంలో ఉన్న పాఠశాలలో విలీనం చేసేశారు. ఇక నుంచి విద్యార్థులు అక్కడికి వెళ్లాలని ఉపాధ్యాయులు తేల్చి చెప్పేశారు. 3, 4, 5 తరగతుల పిల్లలు ఈ పాఠశాలకు రావద్దని స్పష్టం చేశారు. అటవీ సమీపంలో ఉన్న మన్నవరం పాఠశాలకు చిన్నపిల్లలను ఎలా పంపుతారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలను తమ కాలనీలోనే కొనసాగించాలని సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

మా పాఠశాలను మూసివేయొద్దు

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు పాఠశాలను మూసివేయొద్దని సర్పంచ్ మోహన ప్రియ డీఈవోకు విన్నవించారు. ఆమె గ్రామస్తులతో కలిసి సోమవారం ఉదయం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ ఎండీ పుత్తూరు నుంచి పక్క గ్రామ పాఠశాలకు చిన్న పిల్లలు వెళ్లి రావడం కష్టంతో కూడుకున్నదని, మూడు కిలోమీటర్ల మేర పిల్లలు వెళ్లలేని పరిస్థితి ఉందని వివరించారు. పాఠశాల విలీన ప్రక్రియను నిలుపుదల చేసి ఇక్కడి పాఠశాలను ఇక్కడే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జలజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మా పాఠశాలలను కొనసాగించాలి

సత్యవేడు: మండలంలోని పేరడం ప్రాథమిక పాఠశాలను యథావిధిగా ఉంచాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ పాఠశాలను మదనం బేడు పాఠశాలలో విలీనం చేయవద్దని కోరారు. సుమారు రెండు కిలోమీటర్లు దూరం పిల్లలు వెళ్లలేరని విన్నవించారు.

అముదూరు గ్రామస్తుల ఆందోళన

ఏర్పేడు : మండలంలోని అముదూరు గ్రామంలో 1960 నుంచి ఉన్న పాఠశాలను మూసివేయడంతో వారు సోమవారం పెద్ద ఎత్తున ఆందోళనకుదిగారు. మండలంలోని పాగాలి గ్రామంలోనూ పాఠశాల విలీనం ప్రక్రియపై పిల్లలు, తల్లిదండ్రులు పాఠశాల ఎదుట మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. తమ పిల్లలను చదువులకు దూరం చేయొద్దని కోరారు.


అముదూరులో విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్: హత్య కేసులో తిరుపతి, బేరి వీధికి చెందిన సోమశేఖర్‌కు జీవిత ఖైదు, రూ.11 వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి రామ్ గోపాల్ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు కథనం మేరకు, 2022 డిసెంబర్ 19వ తేదీ తిరుపతి, కటిక రంగడి వీధికి చెందిన గుంటూరు అఖిల్ కుమార్ అలియాస్ అఖిల్ ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు సోమశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో సోమశేఖర్‌కు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

11 మంది ఉద్యోగ విరమణ


ఉద్యోగ విరమణ పొందిన పోలీసులు

తిరుపతి క్రైమ్: జిల్లాలో సుదీర్ఘకాలం పాటు ప్రజలకు సేవలు అందించిన 11 మంది పోలీసులు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. అందులో పీసీల నుంచి ఎస్ఐల వరకు అన్ని స్థాయిల వారూ ఉన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిని తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ రవి మనోహరాచారి ఘనంగా సత్కరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహనాలు దగ్ధం


దగ్ధమైన వాహనాలు

తిరుపతి క్రైం: రేణిగుంట రోడ్‌లోని ఓ బైక్ షోరూమ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో వాహనాలు దగ్ధమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి కథనం మేరకు, రేణిగుంట – తిరుపతి మార్గంలో ఉన్న జాయ్ ఈ బైక్స్‌లో ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఒక బైక్ నుంచి మంటలు వచ్చి, మరో 10 వాహనాలకు వ్యాపించాయి. ఈ క్రమంలో 11 బైకులు, ఒక ల్యాప్‌టాప్, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. రూ.20 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక విచారణలో తేలింది అన్నారు. అయితే ఈ షోరూమ్ లో మొత్తం వాహనాలు కాలిపోవడంతో యాజమాని రాజశేఖర్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సకాలంలో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు మరింత వ్యాప్తి చెందకుండా అదుపు చేయగలిగారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట


పోలీస్ స్టేషన్ ఎదుట వివరాలు వెల్లడిస్తున్న ప్రేమ జంట

చిల్లకూరు: గూడూరులో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ ప్రేమ జంట పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ గూడూరు రూరల్ పోలీసులను సోమవారం ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు గూడూరు మండలం చెన్నూరుకు చెందిన రామతేజ, శ్రీకాళహస్తికి చెందిన సాయి దీపిక ఒకే ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. వీరిద్దరూ ప్రేమించుకున్నారు. అయితే వారిద్దరు కులాలు వేరు కావడంతో రెండు కుటుంబాలు వీరి ప్రేమను అంగీకరించలేదు. ఈ జంట పోలీసులను ఆశ్రయించడంతో వారు రెండు కుటుంబాల వారిని పిలిపించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో వారిని ఇబ్బంది పెట్టవద్దని చెప్పి పంపించేశారు.

మట్టిలో మాణిక్యాలుగా వెలుగొందాలి


ప్రధాన వక్త కృష్ణస్వామి రాజును సన్మానిస్తున్న సాహితీ సమితి బృందం

తిరుపతి సిటీ: తెలుగు విద్యార్థులకున్న విభిన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మట్టిలో మాణిక్యాలుగా వెలుగొందాలని రచయిత ఆర్‌సి.కృష్ణ స్వామి రాజు సూచించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో సోమవారం తెలుగు సాహితీ సమితి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. తెలుగు కథా సాహిత్యం గ్రామీణ జీవితం అనే అంశంపై ఆయన మాట్లాడుతూ తెలుగు విద్యను అభ్యసించడానికి ప్రస్తుత తరం వెనకడుగు వేస్తున్నారని, తెలుగు సాహిత్యం చదవాలంటే ఎంతో అదృష్టం ఉండాలని తెలిపారు. తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ కృష్ణ స్వామి రాజు తన చుట్టూ ఉన్న పల్లె జీవితాలను, తాను చూసిన విషయాలను రచనల రూపంలో ప్రజలకు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై సుభాషిణి, సాహితీ సమితి అధ్యక్షులు ఎ ప్రనూష, ఉపాధ్యక్షులు జి వాణి, కార్యదర్శి బి. శిరీష, కోశాధికారి ఎ మోహిత డాక్టర్ లక్ష్మిప్రియ, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 88 అర్జీలు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 88 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక పరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

యువకుడి ఆత్మహత్య


వెంకటరమణయ్య(ఫైల్)

సైదాపురం: కువైట్‌కు వెళ్లి ఇటీవల స్వగ్రామానికి చేరుకున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుని తల్లి కాకాణి లక్ష్మమ్మ అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్ఐ క్రాంతి కుమార్ కథనం మేరకు మండకేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కాకాణి వెంకటరమణయ్య (35)కు అదేకాలనీకి చెందిన భాగ్యమ్మతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి ఇద్దరు కుమారుల్లో ఒకరు గతంలో మృతి చెందారు. బతుకు దెరువు కోసం మూడేళ్ల క్రితం కువైట్ వెళ్లి వారం క్రితమే వచ్చాడు. అయితే భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో వెంకటరమణయ్య ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని పోలీసులు గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యభిచారం కేసులో ఇద్దరి అరెస్ట్

తిరుపతి క్రైమ్: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచారం చేస్తూ ఇద్దరు పట్టుబడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. అలిపిరి సీఐ రామ కిషోర్ కథనం మేరకు, ఉపాధ్యాయ నగర్‌లోని మహేందర్ నివాస్ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లుగా సమాచారం వచ్చింది. వెంటనే సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిర్వాహకురాలితోపాటు జైచంద్ర అనే వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2000 నగదు, కండోమ్‌లు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓవర్ లోడ్.. ఐదు ఆటోలు సీజ్


ఆటోలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ అధికానాజ్

తిరుపతి మంగళం : అద్దెలకు కక్కుర్తి పడి ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న 5 ఆటోలను ఆర్టీఏ అధికారులు సీజ్ చేశారు. జిల్లా రవాణా శాఖాధికారి ఆదేశాల మేరకు సోమవారం మోటారు వాహన తనిఖీ అధికారులు శ్రీనివాస రావు, అధికానాజ్, మోహన్‌కుమార్ అలిపిరి భారతీయ విద్యాభవన్, ఎమ్మార్ పల్లి కూడలి ప్రాంతాల్లో విద్యార్థులను తరలించే ఆటోలను తనిఖీలు చేశారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఐదు ఆటోలను సీజ్ చేశారు. అనంతరం ఆటో డ్రైవర్లకు విద్యార్థుల భద్రతపై అవగాహన కల్పించారు. జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి కళాశాలలు, పాఠశాలల బస్సులతో పాటు విద్యార్థులను తరలించే ఆటోలను నిత్యం తనిఖీలు చేస్తున్నామన్నారు. అందుకోసం మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులను తరలించే వాహనాలకు ఎఫ్‌సీలు లేకపోయినా, ఆర్టీఏ నిబంధనలు పాటించకపోయినా, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకున్నా, అధిక వేగంతో వెళ్లినా, మద్యం తాగి వాహనాలను నడిపినా వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహన డ్రైవర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

సాక్షాత్కార వైభవోత్సవాలు ప్రారంభం


పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. సోమవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు వరకు ఊంజల్ సేవ చేపట్టారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం హనుమంత, బుధవారం గరుడ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. వాహన సేవ ముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూలై 3న పార్వేట ఉత్సవం జరగనుంది. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలో చొరబడి ఎర్రచందనం చెట్లను నరికి, తరలించే కేసులో ఇద్దరికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం సెషన్స్ కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. 2016లో చిత్తూరు జిల్లాకు చెందిన జె దామోదరం, ఏ హరి ప్రసాద్ శేషాచలంలోని ఎర్రచందనం చెట్లను నరికి చంద్రగిరి మండలం, పాండురంగ వారి పల్లి సమీపంలో తరలిస్తుండగా, అటవీ సిబ్బంది ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

గందరగోళంగా సర్వేయర్ల బదిలీలు

- ముడుపులు తీసుకుని బదిలీలు చేశారనే ఆరోపణలు
- తప్పిదాల కారణంగా రెండు గంటల పాటు ఆగిన కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌లో సర్వే శాఖ ఏడీని ప్రశ్నిస్తున్న సర్వే అసిస్టెంట్లు

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామ సచివాలయ సర్వేయర్ అసిస్టెంట్ల బదిలీలు గందరగోళంగా నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సర్వే అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించారు. చిత్తూరు సర్వే శాఖ ఏడీ జయరాజ్ ఆధ్వర్యంలో సర్వే అసిస్టెంట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి సర్వేశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి గందరగోళంగానే సాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 398 సర్వేయర్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. చాలా మందికి అన్యాయం జరగడంతో కలెక్టరేట్ భవనంలో అరుపులు.. కేకలు వినిపించాయి. న్యాయం చేయాలంటూ పలువురు డిమాండ్ చేశారు. మధ్యాహ్నం దాదాపు రెండు గంటలపాటు కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేశారు.

సీనియారిటీలో అవకతవకలు

సీనియారిటీ జాబితాను పకడ్బందీగా సిద్ధం చేసుకోవాల్సిన సర్వే శాఖ అలసత్వం వహించింది. ఆ జాబితా రూపకల్పనలో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఒకే ర్యాంక్‌ను ఇద్దరు సర్వేయర్లకు కేటాయించారు. అలా ఎలా కేటాయిస్తారని సర్వే అసిస్టెంట్లు అధికారులను ప్రశ్నించారు. కనీసం జాబితా ప్రచురించకుండా కౌన్సెలింగ్ నిర్వహించారని ఆరోపించారు. ఈ తప్పిదాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సెలింగ్ మధ్యాహ్నం 1.30 గంటలకు నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీ ప్రకటించారు. సీనియారిటీ జాబితాలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని స్వయంగా ఏడీనే ప్రకటించారు. దీంతో రెండు గంటల పాటు కౌన్సెలింగ్ ప్రక్రియను ఆపేశారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.45 గంటలకు ప్రక్రియను తిరిగి ప్రారంభించారు. పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించేటప్పుడు సీనియారిటీ, ఖాళీల జాబితాలను ఎందుకు ప్రదర్శించలేదని సర్వే అసిస్టెంట్లు ప్రశ్నిస్తున్నారు.

వెల్లువెత్తిన ముడుపుల ఆరోపణలు

సర్వే అసిస్టెంట్ల బదిలీల్లో పలువురికి అనుకూలమైన స్థానాలను కేటాయించేందుకు సర్వేశాఖ అధికారులు ముడుపులు స్వీకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో పోస్టింగ్ నిమిత్తం ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల వరకు స్వీకరించారని కౌన్సెలింగ్‌కు విచ్చేసిన సర్వే అసిస్టెంట్లు ఆరోపించారు. జిల్లాల పునర్విభజన కారణంగా ఆయా జిల్లాల సర్వే అసిస్టెంట్లకు ప్రత్యేకంగా బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలి. అయితే సర్వే శాఖ అధికారులు అలా చేయకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్వే అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను ప్రదర్శించి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. దీంతో చిత్తూరు జిల్లా నుంచి దాదాపు 120 మంది తిరుపతి జిల్లాకు బదిలీ అయినట్టు సమాచారం. తిరుపతి జిల్లాలో పని చేస్తున్న సర్వే అసిస్టెంట్లు చిత్తూరు జిల్లాకు బదిలీ కావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్ పరిశీలించి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.